క్లుప్తంగా



కశింకోట మండలం చింతలపాలెం వద్ద మేమంతా సిద్ధం బస్సు యాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన సినీ నటుడు జోగినాయుడు

\- నాతవరం

పాత కృష్ణదేవిపేటలో తనిఖీలు

• 10 దుంగల గుర్తింపు



అటవీశాఖ గుర్తించిన కలప ఇదే

గొలుగొండ: పాత కృష్ణదేవిపేటలో అక్రమంగా కలప దాచి ఉంచినట్లు వచ్చిన సమాచారంతో స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. అల్లూరి జిల్లా నల్లగొండ నుంచి టేకు చెట్లు నరికి మైదాన ప్రాంతం కృష్ణదేవిపేట తరలించినట్లు సమాచారం అందింది. దీంతో దాడులు చేసి ఆరు టేకు దుంగలు, నాలుగు గన్నర దుంగలు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. రేంజర్ వెంకటరమణ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగులలో నామినేషన్ దాఖలు



ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న తాళ్ల రవి

మాడుగుల: మాడుగుల అసెంబ్లీ స్థానానికి మూడో రోజు శనివారం ఒక నామినేషన్ దాఖలైంది. నవభారత నిర్మాణ సేవా పార్టీ తరఫున తాళ్ల రవి ఒక సెట్టు నామినేషన్ పత్రాలను శనివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వి.సత్యవాణికి అందజేశారు. ఆ పార్టీకి చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సారె ఊరేగింపు



వి.వి.అగ్రహారంలో సారె ఊరేగిస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా వీరవల్లి అగ్రహారంలో శనివారం స్వామివారి సారె ఊరేగింపు నిర్వహించారు. భక్తులు తయారు చేసిన వివిధ రకాల మిఠాయిలు, పండ్లను ఊరేగించి స్వామి వారికి నివేదించారు.

ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ



ఎం.బెన్నవరంలో తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

నాతవరం: మర్రిపాలెం, ఎం.బెన్నవరం సచివాలయాలను ఎంపీడీవో జాగరపు రాంబాబు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టరుతోపాటు కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ములగపూడి పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రధాన సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

మాడుగుల రూరల్: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో వివిధ రకాల పరికరాల ప్రదర్శించారు. వీటి ఎలా ఉపయోగిస్తారో అగ్నిమాపక కేంద్రం అధికారి వద్దాది రాజేశ్వరావు అవగాహన కల్పించారు. గ్యాస్ లేదా కట్టెల పొయ్యి మీద వంట చేసేటప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



చోడవరంలో సభకు తరలి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మాకవరపాలెం: సభకు వెళుతున్న ఎంపీపీ, తదితరులు



బుచ్చెయ్యపేట నుంచి సిద్ధం సభకు వెళ్తున్న ప్రజలు

మేమంతా సిద్ధమే..

దారులన్నీ చింతలపాలెం సభకే అన్నట్టుగా ప్రజలు క్యూకట్టారు. ఆటోలు, బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలతో స్వచ్ఛందంగా తరలివెళ్లారు. దాంతో వాహనాలన్నీ కిక్కిరిశాయి. రోడ్లన్నీ రద్దీగా మారాయి. మేమంతా సిద్ధమే అంటూ నినదిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి బ్రహ్మరథం పట్టారు.

• సీఎం జగన్ సభకు తరలిన ప్రజానీకం
• పెద్ద ఎత్తున చింతలపాలెం పయనం
• కిక్కిరిసిన వాహనాలు



మాడుగుల రూరల్: జె.డి.పేట నుంచి ఎంపీపీ రాజారాం సారథ్యంలో



కె.కోటపాడు: దాలివలస నుంచి బస్సులో వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చీడికాడ నుంచి



దేవరాపల్లి నుంచి మహిళలు

చోడవరం/బుచ్చెయ్యపేట: కశింకోట మండలం చింతలపాలెం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభకు శనివారం చోడవరం నియోజకవర్గం నుంచి వేలాదిమంది ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బస్సు యాత్రలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావడంతో ఆ సభకు బస్సులు, ఆటోల్లో పెద్ద ఎత్తున జనం వెళ్లారు. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ఆటోల్లోను, కార్లులోనూ పార్టీ అభిమానులు తరలివెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల నుంచి ప్రజలు వెళ్లారు. ఎంతో ఉత్సాహంగా తమ నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు వారంతా వెళ్లారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో భారీ బహిరంగ సభ జరగడం వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనుత్తేజాన్ని నింపింది. అన్ని గ్రామాల్లో సందడి కనిపించింది. బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట నుంచి జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, నాయకులు జోగా కొండబాబు, కె. అప్పలనాయుడు, మరిసా నాని, నమ్మి అప్పలరాజు, బోయిన నారాయణమూర్తి, సుంకరి శ్రీను, గాంధీ తదితరులు వాహనాల్లో ర్యాలీగా బయలుదేరారు.

దేవరాపల్లి నుంచి 109 బస్సుల్లో పయనం

దేవరాపల్లి: మేమంతా సిద్ధం ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు దేవరాపల్లి మండలం నుంచి 109 బస్సుల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లాయి. దేవరాపల్లి నుంచి ఐదు బస్సుల్లో నాయకులు, కార్యకర్తలతోపాటు మహిళలు సైతం బయలుదేరి వెళ్లారు. పార్టీ శ్రేణులతో బస్సులన్నీ కిక్కిరిశాయి. జైజగన్, జైబూడి నినాదాలు హోరెత్తించాయి. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, సీనియర్ నాయకులు గండిపడాల అప్పలరాజు, వరదపురెడ్డి లలితానాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, గుండు రాంబాబు, వేచలపు వాణి పాల్గొన్నారు.

కె.కోటపాడు నుంచి 70 బస్సుల్లో

కె.కోటపాడు: సీఎం జగన్ నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు కె.కోటపాడు మండలం నుంచి 70 బస్సుల్లో ఐదు వేల మందికి పైగా స్వచ్ఛందంగా తరలివెళ్లారు. కె.కోటపాడు నుంచి ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, చౌడువాడ నుంచి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, ఆనందపురం నుంచి సర్పంచ్ అప్పాజి, దాలివలస నుంచి ఆదిరెడ్డి రామునాయుడు, భూమిరెడ్డి దేముళ్లు, కొరువాడ జగన్నాథపురం నుంచి సచివాలయ కన్వీనర్లు యడ్ల దేముళ్లు, చీపురపల్లి గోవిందతోపాటు అన్ని గ్రామాల్లో ఆయా పార్టీల నాయకులు, సర్పంచ్, ఎంపీటీసీల ఆధ్వర్యంలలో ప్రజలు, అభిమానులు బయలుదేరి వెళ్లారు.

మాడుగుల రూరల్/చీడికాడ: మాడుగుల మండలం నుంచి 70 బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాల ద్వారా పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. మాడుగుల నుంచి పార్టీ మండలాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు సారథ్యంలో, జె.డి.పేట నుంచి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ సారథ్యంలో, తరలి వెళ్లారు. ప్రతి గ్రామం నుంచి రెండు నుంచి మూడు లేదా నాలుగు బస్సులు ఏర్పాటు చేశారు.

➡ చీడికాడ మండలంలోని 23 పంచాయతీల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, మహిళలు భారీగా తరలివెళ్లారు.

మాకవరపాలెం/నాతవరం: కశింకోట మండలం చింతలపాలెం వద్ద సీఎం జగన్ బహిరంగ సభకు మాకవరపాలెం మండలంలోని 31 పంచాయతీల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం మధ్యాహ్నం తరలివెళ్లారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఇతర నేతల ఆధ్వర్యంలో బస్సుల్లో సభకు తరలారు. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులతో విశాఖ-నర్సీపట్నం ప్రధాన రహదారి కిక్కిరిసిపోయింది.

➡ నాతవరం మండలంలో 31 పంచాయతీల నుంచి నాయకులు, కార్యకర్తలు ఎండను సైతం ఖాతరు చేయకుండా జై జగన్ అంటూ నినాదాలు చేసుకుంటూ ఉత్సాహంగా తరలి వెళ్లారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ



గంటవానిపాలెంలో ఐఆర్‌ఎస్ సర్వే చేస్తున్న అధికారులు

మునగపాక : మండలంలోని గంటవానిపాలెంలో శనివారం జిల్లా మలేరియా అధికారి దొర ఆధ్వర్యంలో దోమల నివారణకు సంబంధించి సర్వే చేపట్టారు. దోమల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేర్ రాణి, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య, ఎంపీహెచ్‌ఏ ఎస్.అప్పలనాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

ఎస్.రాయవరం: నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు తుని రైల్వే ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ శనివారం తెలిపారు. తుని నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న ట్రాక్‌పై 65 ఏళ్ల వయసు గల వృద్ధుడు మృతి చెంది ఉన్నట్టు చెప్పారు. రైలు ఢీకొని మృతదేహం నుజ్జునుజ్జు అయిందన్నారు. ఎరుపు, నలుపు రంగు గల టీ షర్టు పడి ఉందని, మరే ఆధారాలు లభ్యం కాలేదన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. అచూకీ తెలిసిన వారు తుని రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలు

రాంబిల్లి : లాలంకోడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఘనంగా ఫేర్‌వెల్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. విద్యార్థులు చేసిన కోలాటం, నృత్యాలు అలరించాయి. చదువులోనూ, కరాటేలోను ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను హెచ్‌ఎం పీఆర్‌కే రాజు, ఉపాధ్యాయులు అందజేశారు.

డ్వాక్రా రుణమాఫీ ఎగ్గొట్టిన చంద్రబాబు

• జగనన్న ఇచ్చిన మాట ప్రకారం మాఫీ
• ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సతీమణి విజయలక్ష్మి



వడ్డాదిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విజయలక్ష్మి

బుచ్చెయ్యపేట: సమాజంలో మహిళల గౌరవాన్ని పెంచి వారి ఆర్థిక పురోభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం జగనన్నకే పట్టం కట్టాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సతీమణి విజయలక్ష్మి కోరారు. శనివారం వడ్డాది మేజర్ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ చోడవరం అభ్యర్థి కరణం ధర్మశ్రీ గుర్తు ఫ్యాన్‌కి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆమె ఇంటింటా తిరిగారు. మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. 14 ఏళ్ల పాలన చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేసి ఆదుకుంటామన్నాడు. బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారు వస్తువులు విడిపించి ఆదుకుంటానని గద్దె నెక్కిన తర్వాత మహిళల్ని మోసం చేశాడని విమర్శించారు. నెలకు రెండు వేల నిరుద్యోగ భృతి, ఇంటికొక ఉద్యోగం ఇవ్వకుండా, రైతు రుణమాఫీ చేయకుండా దగా చేసిన చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. సీఎం జగనన్న ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన వాగ్దానం మేరకు ప్రతి మహిళా ఆర్థిక పురోభివృద్ధి సాధించేలా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. అమ్మ ఒడి, చేయూత, ఆసరా తదితర సంక్షేమ పథకాలతోపాటు అన్ని రంగాల్లో మహిళలకు రిజర్వేషన్ అమలు చేసి ఆత్మ గౌరవాన్ని పెంచారన్నారు. మహిళలపై దాడులు అరికట్టేందుకు దిశ తీసుకొచ్చారని ప్రశంసించారు. రానున్న ఎన్నికల్లో ధర్మశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దామని తెలిపారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, ఎంపీటీసీలు కోరుకొండ లీలావతి రమణ, ఇంటి అప్పారావు, నాయకులు సయ్యపురెడ్డి కొండబాబు, బొబ్బరి ఈశ్వరరావు, శంకర్రావు, వీర్ల నానాజీ, గిరి, దాసు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



రాజీనామా లేఖలు చూపుతున్న కొత్తకోట వలంటీర్లు



రాజీనామా పత్రాలను కార్యదర్శికి అందిస్తున్న జెడ్.కొత్తపట్నం గ్రామ వలంటీర్లు



రాజీనామా చేసిన కొమరవోలు వలంటీర్లు



రాజీనామా పత్రాలను సెక్రటరీకి అందజేస్తున్న తారువ వలంటీర్లు



రాజీనామా పత్రాలను అందజేస్తున్న నాగయ్యపేట వలంటీర్లు

రావికమతం/రోలుగుంట/దేవరాపల్లి: రావికమతం మండలంలో కొత్తకోట, జెడ్.కొత్తపట్నం గ్రామ వలంటీర్లు 67 మంది శనివారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వారి రాజీనామా లేఖలను ఎంపీడీవో భానోజీరావుకు, ఆయా గ్రామాల సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. రోలుగుంట మండలం కొమరవోలు గ్రామ సచివాలయం నుంచి 9 మంది వలంటీర్లు రాజీనామా చేసి పంచాయతీ కార్యదర్శి లాలం శివకు అందజేశారు. దేవరాపల్లి మండలం తారువలో 8 మంది వలంటీర్లు స్థానిక పంచాయతీ సెక్రటరీ పి.అప్పలనాయుడుకు, నాగయ్యపేటలో ముగ్గురు వలంటీర్లు స్థానిక సచివాలయ అధికారి సునీతకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి వలంటీర్ వ్యవస్థ ప్రవేశ పెట్టి ప్రజలకు స్వచ్ఛమైన సేవలందిస్తున్నారన్నారు. తమపై అక్కసుతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నిత్యం నిందిస్తుండటమేగాక తన అనుయాయులతో కోర్టు ద్వారా ఎలక్షన్ కమిషన్‌కు ఆదేశాలిప్పించి ప్రజా సేవకు దూరం చేశారన్నారు. దీంతో తామంతా మూకుమ్మడి రాజీనామాలు చేసి, ఇకపై ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొంటామని, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించుకుంటామని ముక్తకంఠంతో తెలిపారు.

చౌడువాడ.. అభివృద్ధి జాడ



• రూ.21.62 కోట్లతో ప్రగతి పథంలో గ్రామం
• శివారు మల్లంపాలెం, పాచిలవానిపాలెం గ్రామాల్లో వెలుగులు
• రూ.7.65 కోట్లతో ఇంటింటి కుళాయిలు
• రూ.1.72 కోట్లతో పీహెచ్‌సీ భవనం
• నాడు-నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు



రైతు భరోసా కేంద్రం



చౌడువాడలో నూతన పీహెచ్‌సీ భవనం



చిన గరుగుబిల్లిలో తాగునీటి ట్యాంకు ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి (ఫైల్)



గవరపేట నుంచి శెరీరోడ్డులో సీసీరోడ్డు

కె.కోటపాడు: చౌడువాడ మేజర్ పంచాయతీ ప్రగతికి చిరునామాగా మారింది. మట్టిరోడ్లు సీసీ రోడ్లుగా రూపాంతరం చెందగా, కనీసం మరమ్మతులకు నోచుకోని పీహెచ్‌సీకి నూతన భవనాలు సమకూరాయి. తాగునీటి కష్టాలు తీర్చేందుకు జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటి కుళాయిలు ఏర్పాటయ్యాయి. వెరసి చౌడువాడతోపాటు శివారు మల్లంపాలెం, పాచిలవానిపాలెం, చిన గరుగుబిల్లి గ్రామాల్లోనూ రూ.21.62 కోట్లతో పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మరికొన్ని నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.



ప్రారంభోత్సవానికి సిద్ధమైన సచివాలయం

➡ చౌడువాడ పీహెచ్‌సీ భవనాలు మరమ్మతులకు నోచుకోవడంతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో రూ.1.72 కోట్లతో నూతన భవనం నిర్మించారు. ఇదే ఆస్పత్రిలో మరో రూ.50 లక్షలతో ల్యాబ్ పరీక్షలకు, రోగులు వేచి ఉండేందుకు అదనపు భవనాన్ని నిర్మాణం చేస్తున్నారు.

➡ చౌడువాడలో రెండేసి సచివాలయ, ఆర్బీకే భవనాలను రూ.87.20 లక్షలతో నిర్మించారు.

➡ రూ.50 లక్షలతో గవరపేట నుంచి శెరీరోడ్డుకు వెళ్లే గోర్జును సీసీరోడ్డుగా నిర్మించారు.

➡ చౌడువాడ, మల్లంపాలెం, పాచిలవానిపాలెం, చిన గరుగుబిల్లి, బంటువారి కళ్లాల వద్ద రూ.3 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణం

➡ పాచిలవానిపాలెంలో రూ.36 లక్షలు, మల్లంపాలెంలో రూ.23 లక్షలు, చౌడువాడలో రూ.6.68 కోట్లతోపాటు గరుగుబిల్లిలో తాగునీటి పథకాలకు, బంటువారి కళ్లాల్లో, చిన గరుగుబిల్లిలో మంచినీటి పథకాలకు విద్యుత్ లైన్ ఏర్పాట్లకు రూ.30 లక్షల జలజీవన్ మిషన్ నిధులు మంజూరయ్యాయి.

➡ నాడు-నేడు నుంచి చౌడువాడ హైస్కూల్‌కు రూ.1.8 కోట్లు, ప్రాథమిక పాఠశాలకు రూ.18లక్షలు, గరుగుబిల్లి ప్రాథమిక పాఠశాలకు రూ.25 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.

➡ చౌడువాడ-మల్లంపాలెం గ్రామాల మధ్య చిట్టిగెడ్డపై రూ.2.40 కోట్లతో వంతెన నిర్మిస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి



మల్లంపాలెం, పాచిలవానిపాలెం, చిన గరుగుబిల్లిలో సీఎం జగన్ పాలనలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగింది. మంచినీటి పథకాలతోపాటు సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. గతంలో మట్టిరోడ్లతో ఇబ్బందులు పడ్డ మాకు సీసీరోడ్లతో కష్టాలు తీరాయి.

\- వంటాకు రామునాయుడు, మల్లంపాలెం

ఊహించలేదు



గవరపేట సంతోషిమాత ఆలయం నుంచి శెరీ రోడ్డు గోర్జుగా ఉండేది. డిప్యూటీ సీఎం దృష్టికి సమస్యను రైతులంతా తీసుకెళ్లారు. వెంటనే ఆయన సీసీరోడ్డు నిర్మించారు. డ్రైనేజీకి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. రైతులు పొలాలకు, జుత్తాడ, చోడవరం ప్రాంతాలకు వెళ్లేందుకు అనువైన రోడ్డు సౌకర్యం కలుగుతుందని ఊహించలేదు.

\- తనకల అప్పలకోటి, రైతు, చౌడువాడ

తొలగిన తాగునీటి కష్టాలు



చౌడువాడలో తాగునీటి సమస్య వేధించేది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారానికి డిప్యూటీ సీఎం బూడి జలజీవన్ మిషన్ నుంచి రూ.7.65 కోట్లు కేటాయించారు. ఈ మొత్తంతో శివారు గ్రామాల్లో ఇంటింటి కుళాయిల ఏర్పాటు చేశారు. చౌడువాడలో పలు ప్రాంతాల్లో ఇప్పటికే పూర్తయింది.

\- దాట్ల శివాజీరాజు, చౌడువాడ